నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

8 | నిజామాబాద్, ఆదివారం 1 జూన్ 2025 | NIZAMABAD




# జీజీహెచ్.. నిర్వహణ తూచ్!

రోగులకు భద్రత కరువు



పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీ

- అద్దాల మేడలో అంతులేని నిర్లక్ష్యం
- పైకప్పు నుంచి ఊడుతున్న పెచ్చులు
- పగిలిన అద్దాలు.. వార్డుల్లోకి వర్షపునీరు
- పైపులైన్‌కు లీకేజీలు, గోడలపై పేరుకుపోయిన నాచు
- దుర్గంధంతో రోగులు, బంధువుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఖలీల్‌వాడి, మే 31: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉత్తమ వైద్య సేవలు అందించడంలో రాష్ట్రస్థాయిలో ఒక వెలుగు వెలిగిన నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ దవాఖాన (జీజీహెచ్)లో ప్రస్తుతం నిర్లక్ష్యం తాండవిస్తున్నది. పేదలకు వైద్య సేవలు అందించడంలో విఫలమవుతున్నది. ఏడంతుస్తుల మేడలో ఏర్పాటు చేసిన దవాఖాన నిర్వహణపై నీలి నీడలు అలుముకున్నాయి. రోగులకు సేవలు అందించడం అటుంచితే, దవాఖాన భవనం మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారింది. పట్టించుకునే వారు కరువవడంతో రోగులకు భద్రత కరువైంది. దవాఖాన వెలుపలతో పాటు లోపల పగిలిన అద్దాలు దర్శనమిస్తున్నాయి. భారీ వర్షం కురిస్తే చాలు వార్డుల్లోకి వర్షపునీరు వచ్చి చేరుతున్నది. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

## ఆగని లీకేజీలు.. పట్టించుకోని అధికారులు

జీజీహెచ్‌లో గతంలో ఓ వార్డులో అద్దాలు పగిలిపోయి ఉండడంతో వర్షానికి నీరంతా కిటికీల ద్వారా వార్డుల్లోకి చేరింది. దీంతో రోగులు వారు తెచ్చుకున్న దుస్తులను అడ్డుగా పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు కూడా భారీ వర్షం కురిస్తే చాలు కిటికీల నుంచి నీరంతా వార్డులు, ఫ్లోర్‌లోకి వచ్చి చేరుతున్నది. పట్టించుకునే వారు కరువవడంతో ఏండ్లు గడుస్తున్నా లీకేజీలు మాత్రం ఆగడంలేదు. కొంతకాలం క్రితం దవాఖానను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ తనిఖీ చేసి, నిధులు మంజూరు చేశారు. మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు ఎక్కడా కనిపించడంలేదు. భవనం వెలుపల పైపులైన్ లీకేజీ ఏర్పడడంతో గోడలపై నాచు పేరుకుపోయింది. అటువైపు వెళ్లేవారికి దుర్గంధం వ్యాపించడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. వైద్య కళాశాలలో చదువుతున్న పీజీ స్టూడెంట్లు, ఎంబీబీఎస్ వైద్యులు దుర్వాసన భరించలేకపోతున్నారు. సమస్య పరిష్కారం కోసం ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొన్నది.



భవనం గోడలపై పేరుకుపోయిన నాచు

## ఎవరికి వారే.. యమునా తీరే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి జీజీహెచ్‌లో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా వైద్య సేవలు అందించిన జిల్లా ప్రభుత్వ దవాఖాన నేడు ఎవరూ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. అజామాయిషీ చేసేవారు కరవవడంతో నిర్వహణ గాడి తప్పింది. దవాఖానను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు రోగులకు సేవలుఅందించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ప్రస్తుతం దేశంలో మళ్లీ కొవిడ్ కేసులు కలకలం రేపుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వ దవాఖానలో అన్ని సిద్ధంగా ఉంచాల్సి ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లా దవాఖానపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇటీవల శిశువుకు తప్పిన ప్రమాదం

జీజీహెచ్‌లోని మొదటి అంతస్తులో రూం నంబర్ 178లో ఇటీవల పైకప్పు నుంచి పెచ్చులూడాయి. అవి బెడ్‌పై ఉన్న నవజాత శిశువుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన వైద్య సిబ్బంది శిశువును వెంటనే పక్కవార్డులోకి మార్చారు. ఈ ఘటన దవాఖాన నిర్వహణపై నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నది.



పగిలిన కిటికీ అద్దాలు



### ప్రజల సమస్యలను అధికారులే పరిష్కరించాలి

ప్రజల సమస్యలను తెలుసుకొని అధికారులే పరిష్కరించాలి. పైకప్పు నుంచి పెచ్చులూడి పడ్డాయంటే దవాఖాన నిర్వహణలో ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రాణాలను కాపాడుకోవడానికి దవాఖానకు వస్తే ఇలాంటి ఘటనలు జరిగితే భయాందోళనకు గురవుతున్నారు. నిరుపేదలు ప్రభుత్వ దవాఖానలనే ఆశ్రయిస్తారు. వారికి అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలి.

- రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి



### పట్టించుకునే వారే కరువయ్యారు..

ప్రభుత్వ దవాఖానకు సామాన్యులే వస్తారు. వారికి ఎలాంటి వైద్యమైనా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలు కల్పించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేవి. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకునే వారే కరువయ్యారు.

- విజయలక్ష్మి, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లాకార్యదర్శి

# హైకోర్టు జడ్జికి స్వాగతం



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సృజనకు పూలమొక్కను అందజేస్తున్న సీపీ సాయి చైతన్య

వినాయక్‌నగర్/సుభాష్‌నగర్, మే 31: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సృజన తన వ్యక్తిగత పర్యటనలో భాగంగా శనివారం జిల్లాకేంద్రానికి వచ్చారు. ఆమెకు స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజ్‌తో పాటు ఇతర న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సీపీ సాయిచైతన్య జడ్జిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పూల మొక్కను అందజేశారు. గతంలో నిజామాబాద్ జిల్లా జడ్జిగా విధులు నిర్వహించానని, బార్, బెంచ్ మధ్య చక్కని సమన్వయం ఉండి దీర్ఘకాలిక న్యాయవివాదాలను పరిష్కరించుకున్న తీరును ఈ సందర్భంగా ఆమె గుర్తుచేసుకున్నారు. అనంతరం తమ కుటుంబ సభ్యులతో సారంగపూర్ హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



తమ 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా దంపతులు మాక్లూర్‌లోని వారి వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఏక బిల్వం, కొబ్బరిమొక్కను నాటా రు. అంతకుముందు శ్రీ పాండురంగ స్వామి, శ్రీ అయ్యప్ప స్వామి, శ్రీ వీరహనుమాన్ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–మాక్లూర్, మే 31

# ఐటీ టవర్‌లో టాస్క్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు

కంఠేశ్వర్, మే 31: నిరుద్యోగ యువత కోసం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రాంతీయ కేంద్రాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు టాస్క్ ప్రాంతీయ కేంద్రాల ముఖ్య అధికారి నవీన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ ద్వారా ఉన్నత స్థాయి నైపుణ్యాలను పెంపొందించుకొని మంచి ఉద్యోగావకాశాలను పొందాలని ఆయన సూచించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రిలేషన్‌షిప్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన ఇతర నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిజామాబాద్‌లోని టాస్క్ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తు రుసుము 599 రూపాయలు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9154252588, 7013675052 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

# రెవెన్యూ సదస్సులు సమర్థవంతంగా నిర్వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

## కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మే 31: భూసంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల దరఖాస్తులు స్వీకరించేందుకు వీలుగా జూన్ 3వ తేదీ నుంచి గ్రామాల వారీగా చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లకు రెవెన్యూ సదస్సుల నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలోని నిబంధనలపై దరఖాస్తులను పరిష్కరించాల్సిన తీరును వివరించారు. ఇప్పటికే పైలెట్ ప్రాతిపదికన జిల్లాలోని మెండోరా మండలంలోని ఎనిమిది గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామని కలెక్టర్ తెలిపారు. అదే తరహాలో ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ నూతన ఆర్‌వోఆర్‌తో చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించాలన్నారు. జూన్ 20వ తేదీలోగా రెవెన్యూ సదస్సులను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సదస్సుల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని రెండు రోజుల ముందే ఆ ప్రాంత రైతులు, ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్లలో సమగ్ర వివరాలను నమోదు చేస్తూ పూర్తి డాటాను కంప్యూటర్ ఆన్‌లైన్‌లోనూ పొందుపర్చాలని ఆదేశించారు. ఒకే దరఖాస్తులో ఒకటి కన్నా ఎక్కువ సంఖ్యలో భూ సమస్యలను పొందుపరిస్తే ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిశీలిస్తూ వేర్వేరుగా విచారణ జరుపాలన్నారు. అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల పండుగ



నాగిరెడ్డిపేట, మే 31: మండలంలోని ఉమ్మడి తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తాండూర్, కిచ్చన్నపేట, అక్కంపల్లి గ్రామాలకు చెందిన ముదిరాజ్ కులస్తులు శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మూడు గ్రామాల నుంచి 16 వందల బోనాలను డప్పు వాయిద్యాలు మధ్య పోతరాజుల విన్యాసాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది పాల్గొనగా.. ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల పేరిట

# ఇసుక దందా!

జోరుగా అక్రమ రవాణా

- యథేచ్ఛగా జేసీబీలతో తవ్వకాలు
- గ్రామకమిటీకి ఒక్కో ట్రాక్టర్ తరపున రూ.50వేలు చెల్లించాల్సిందే
- అక్టోబర్‌లోగా 34 రోజులు తవ్వకాలకు అవకాశం
- అదనంగా ట్రాక్టర్ తెచ్చిన నాయకుడికి రూ.లక్ష జరిమానా!




వెల్కటూర్ శివారులో పొక్లెయిన్‌తో తవ్వుతున్న ఇసుక

మోర్తాడ్, మే 31: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితంలేకుండా పోతున్నది. బాల్కొండ నియోజకవర్గంలో ఏడాదిన్నర కాలంగా మొరం, ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లతో చేసేదేమీలేక అందిందే పదివేలు అన్నట్లు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఫ్రీగా ఇస్తామని అధికారపార్టీ నేతలు చెబుతున్నా..క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మెండోరా మండలం వెల్కటూర్, ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామశివారులోని పెద్ద వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా ఇందిరమ్మ ఇండ్ల పేరిట జోరుగా సాగుతున్నది. అడిగే వారు లేరు...పట్టించుకునే వారు అసలేలేరన్నట్లుగా మారింది పరిస్థితి. ఇసుక అక్రమ రవాణా గురించి సోషల్‌మీడియా వేదికగా ప్రశ్నించిన బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు నమోదు చేసిన ఘటన ఇటీవలే ముప్కాల్‌లో చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

### గ్రామ కమిటీకి ట్రాక్టర్‌కు రూ.50 వేలు

ఇసుక పాయింట్లు ఏర్పాటు చేసే గ్రామకమిటీలకు ట్రాక్టర్‌కు రూ.50వేలు చెల్లించాల్సిందే. ఈ ఒప్పందం మేరకు ట్రాక్టర్‌కు రూ.50వేలు గ్రామకమిటీకి చెల్లించి ఇసుకను తీసుకెళ్తున్నారు. ఏడాది కాలంగా ఇదే తంతు కొనసాగుతున్నా ఈసారి మాత్రం కొంత మార్పు చేసుకున్నారు. వర్షాకాలం కావడంతో వర్షాలు కురిస్తే ఇసుకను తరలించడానికి అవకాశం ఉండదు. దీంతో అక్టోబర్ వరకు 34 సార్లు ట్రాక్టర్‌కు రూ.50వేలు చెల్లించాలనే నిబంధన విధించుకున్నట్లు తెలిసింది. ఇటీవల బట్టాపూర్‌లో ఓ నాయకుడు అదనంగా ఒక ట్రిప్పు ట్రాక్టర్ ఇసుకను తరలించగా.. గ్రామకమిటీ రూ.లక్ష జరిమానా విధించినట్లు సమాచారం.

గ్రామ కమిటీకే డబ్బులు చెల్లిస్తున్న ఇసుకాసురులు..ఇక అధికారులకు చెల్లించరా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్నవారి కోసం అంటూ ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారు. జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థమవుతున్నది. నియోజకవర్గంలో చాలాచోట్ల ఇసుక డంపులు కనిపిస్తున్నాయి. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



బట్టాపూర్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు